క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప స్వామి పడి పూజ



అయ్యప్ప పడి పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

శంషాబాద్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప మహా పడి పూజను వైభవంగా నిర్వహించారు. మధుసూదన్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన 18 మహాపడి పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి నామస్మరణలు, భక్తి పాటలు, భజనతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. అనంతరం అన్న ప్రసాద (భిక్ష) వితరణ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్. గణేష్‌గుప్తా, మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనానికి మరమ్మతులు



పెయింటింగ్ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత సురేష్‌గౌడ్

బండ్లగూడ: విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నాయకుడు గోకరి సురేష్‌గౌడ్ అన్నారు. దర్గాఖలీజ్ ఖాన్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ భవనానికి తన సొంత నిధులతో పెయింటింగ్‌తోపాటు తదితర మరమ్మతు పనులను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటికి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించేందుకు తనవంతు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూసుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

సైన్స్ ఎగ్జిబిషన్

శంషాబాద్ రూరల్: పాల్మాకులలో ఉన్న ఆదర్శ పాఠశాలలో శనివారం స్టెమ్‌స్పార్క్ ఇన్నోవేషన్ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో దడ

- రోడ్లన్నీ గుంతలమయం
- పెద్దపెద్ద గోతులతో పెరుగుతున్న ప్రమాదాలు
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా స్పందించని అధికార యంత్రాంగం
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



కాటేదాన్‌లోని ఓల్డ్ కర్నూలు రోడ్డుపై ఏర్పడిన గుంతలు



బోల్తా పడిన ఆటోను క్రేన్‌తో తీస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రధాన, అంతర్గత రహదారులనే తేడాలేకుండా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దాదాపు అన్ని రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. ఆయా రహదారులపై ప్రయాణించాలంటేనే వాహనదారులేకాకుండా పాదచారులు సైతం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లే దుస్థితి ఉందంటే రోడ్లు ఎంత అధ్వానంగా ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది. ఎక్కడ ఏ గోతి ఉంటుందో... ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. గుంతల రోడ్లతో ప్రమాదాల బారిన పడుతున్నామని.. వాటికి మరమ్మతులు చేయాలని స్థానికులు సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా వారిలో చలనం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

◆ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలోని ఓల్డ్ కర్నూలు రోడ్డు ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ దారిపై ఏర్పడిన గుంతల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా శనివారం ఉదయం జరిగిన ప్రమాదంలో కాటన్ లోడ్‌తో వెళ్తున్న ఆటో రహదారి మీద ఉన్న గుంతల కారణంగా బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. క్రేన్ సాయంతో ఆటోను పైకి లేపారు. ఈ రహదారిపై ఇలాంటి ప్రమాదాలు వరుసగా జరుగుతున్నా అధికారులు సమస్యను పరిగణలోకి తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

◆ రాత్రి వేళల్లో వీధి దీపాలు సైతం లేనందున ప్రమాదాలు మరింత పెరుగుతున్నాయని ప్రజలు, వాహనాదారులు, స్థానికులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రహదారికి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నిధుల లేమి సాకుతో సమస్యను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి గుంతల రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

స్పందించిన నవయువ యూత్ క్లబ్...

కాటేదాన్ ఓల్డ్ కర్నూలు రోడ్డుపై ఉన్న దారుణ పరిస్థితిని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందిండం లేదని నవయువ యూత్ క్లబ్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం ఆటో బోల్తాపడిన విషయాన్ని తెలుసుకొని ప్రతినిధులు సత్వరమే స్పందించారు. వారు అక్కడికి చేరుకొని క్రేన్‌ను తీసుకొచ్చి రోడ్డు మధ్యలో బోల్తా పడిన ఆటోను పక్కకు తీయించారు. కార్యక్రమంలో సభ్యులు ఏర్వ కుమారస్వామి, కొంపల్లి జగదీష్, కిషోర్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లను బాగు చేయరా: బీఆర్ఎస్



అంజలిగార్డన్ రోడ్డు దుస్థితిని చూపుతున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: అంజలి గార్డన్‌లోని కాలనీ రోడ్లను ఇష్టారాజ్యంగా బిల్డర్‌లు తవ్వి నాశనం చేశారని, పలు చోట్ల కుంగి ఇబ్బందిగా మారటంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కల్గిస్తోందని మున్సిపల్ అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో పైపెట్రోల్ పంపు నుంచి అంజలి గార్డన్‌లో రోడ్డు పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పనులు కొనసాగుతున్న ఓ టవర్‌కు డ్రైనేజీ పైప్‌లైన్ వేయటంతో ఎక్కడ పడితే అక్కడ కుంగి పోయిందన్నారు. మరమ్మతు పనులను సరిగా చేయకపోవటంతో గుంతల మయంగా మారిందన్నారు. దాన్ని మున్సిపల్ అధికారులు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నవీన్‌కుమార్, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, జి.రాఘవేందర్, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, మాల్యాద్రి నాయుడు, శ్రీకాంత్, కిరణ్, దిలీప్, షేక్ ఆరిఫ్, సుమ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి



నార్సింగిలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు నర్సింగ్‌రావు

మణికొండ: కర్షక, కార్మిక, ఉద్యోగులు, పేదలకు శతాబ్ద కాలంగా అండగా ఉన్న సీపీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కదలి రావాలని ఆ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం సీపీఐ శతాబ్ది ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1925లో కాన్పూర్ కేంద్రంగా సీపీఐ ఆవిర్భవించిందన్నారు. కార్మికులు, రైతులు, కర్షకులు, ఉద్యోగుల అభ్యున్నతికి పార్టీ అలుపెరగని పోరాటం చేసి వారికి అనుకూలంగా వందలాది చట్టాలు వచ్చేలా కృషి చేసిందన్నారు. ఈ నెల 30వ తేదీన రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాల వారీగా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి పెద్ద ఎత్తున నల్లగొండ సభకు ప్రజలు తరలివచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ఎ.రియాజ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మల్లేష్, మండల అధ్యక్షుడు ఎం.బాబురావు, మండల కార్యదర్శి స్వామి, నాయకులు బండి నర్సింహ, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రెడీమిక్స్ ప్లాంట్లను తొలగించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గౌతమ్‌రెడ్డి

- తొలగించకుంటే బాధితుల తరఫున పోరాటం చేస్తా
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: జనావాసాలకు సమీపంలో ఉండి ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్న రెడీమిక్స్ ప్లాంట్లు, క్రషర్‌లను వెంటనే తొలగించాలని, లేదంటే బాధితుల పక్షాన తానే పోరాటం చేయాల్సి ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. శనివారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని మైం హోం అవతార్. హాల్ మార్క్ విసినియా గేటెడ్ కమ్యూనిటీల వాసులు ఆయనను మరో మారు కలిసి కాలుష్యం గురించి వివరించారు. తమ సమస్యను ప్రజాప్రతినిధులతో పాటు అన్ని వర్గాల అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. చివరకు ప్రజలంతా కలసికట్టుగా రోడ్డు ఎక్కి ధర్నా సైతం నిర్వహించామని వివరించారు. దాంతో ఆయన వెంటనే కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం సాయంత్రం వరకు వాటిని మూసి వేయాలన్నారు. ప్రజల ఇబ్బందులను తీర్చాల్సిన అధికారులు కాలయాపన చేస్తూ వారికి మరింత ఇబ్బంది కలిగించటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వాటిని శాశ్వతంగా తొలగించి ప్రజలకు కాలుష్య రహిత వాతావరణంలో జీవించే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రెడీమిక్స్ ప్లాంట్లకు వ్యతిరేకంగా పోరాడుతున్న గౌతమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేష, మణికొండ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు ఆర్.నర్సింహ, బి.శ్రీరాములు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



ఎస్.అర్జున్

అత్తాపూర్: పని నిమిత్తం నగరానికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... అత్తాపూర్ రాంబాగ్ ప్రాంతానికి చెందిన ఎస్.గౌరి, ఎస్.అర్జున్(46)లు దంపతులు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వీరు కుటుంబ సమేతంగా రెండు నెలల క్రితం స్వరాష్ట్రమైన కర్ణాటకకు వెళ్లారు. అయితే అక్కడ పని తనకు నచ్చడం లేదంటూ అర్జున్ తిరిగి హైదరాబాద్‌కు వచ్చాడు. అనంతరం గోల్డెన్ ప్యాలెస్ పిల్లర్ నంబర్ 143 వద్ద ఉన్న హోటల్‌లో పని చేస్తున్నట్లు బంధువుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. భర్త అర్జున్ తిరిగి ఇంటికి వస్తాడనుకున్న కుటుంబ సభ్యులు ఇప్పటి వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన భార్య గౌరి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బటర్‌ఫ్లై పార్కు త్వరలో ప్రారంభం



పార్కును పరిశీలిస్తున్న నరేందర్‌రెడ్డి తదితరులు

మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన బటర్‌ఫ్లై పార్కును త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన 13వ వార్డు లక్ష్మీనగర్ కాలనీలో పనులను పూర్తి చేసుకున్న పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అనేక పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవటంతో వారు ప్రతి రోజూ సేద తీరుతున్నారన్నారు. అదే తరహాలో లక్ష్మీనగర్‌లోని మరో పార్కు ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. అధికారులతో చర్చించి త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు బి.రవికాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

శంషాబాద్: బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ బాలరాజు సమాచారం మేరకు... రాజన్న సిరిసిల్ల ప్రాంతానికి చెందిన వెంకటేష్ కుమారుడు అవినాష్(19) శంషాబాద్‌లోని వర్ధమాన్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శంషాబాద్ పట్టణంలోని ఆర్‌బీనగర్‌లోని హాస్టల్‌లో ఉంటున్న ఆ యువకుడు శనివారం ఉదయం తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో హాస్టల్ నిర్వాహకులు తల్లిదండ్రులతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫుడ్ ఫెస్టివల్ అదుర్స్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నిర్మలజ్యోతి

అత్తాపూర్: రాజేంద్రనగర్ పట్టణ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్‌ను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలను అనుసరించి విద్యార్థులకు సమతుల్య ఆహారం అందించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచనలు చేశారు. మిడ్ డే మీల్స్‌లో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా తాజా కూరగాయలతో విద్యార్థులకు మిడ్‌డే మీల్స్ అందించాలన్నారు. న్యూట్రీషన్ ఫుడ్‌లో భాగంగా రాగి లడ్డూ, నువ్వుల పట్టి, పల్లీపట్టీలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు పేరెంట్స్ కమిటీ సహకరించాలన్నారు. కార్యక్రమంలో హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల జ్యోతి, అత్తాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, స్వరూపారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి

రాజేంద్రనగర్: బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ సమావేశం బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఉప్పర్‌పల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ కార్యదర్శి, రాజేంద్రనగర్ డివిజన్ సభ్యత్వ ఇన్‌చార్జి డాక్టర్ ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాబోయే వారం రోజుల్లో పార్టీ క్రియాశీలక సభ్యత్వం, డివిజన్‌లోని బూత్‌స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పకార్యక్రమంలో నాయకులు వై.శ్రీధర్, బొక్క బాల్‌రెడ్డి, మొంద్ర కొమురయ్య, గోనె శ్రీకాంత్ రెడ్డి, శత్రజ్ఞ, పవన్ కుమార్, కరుణాకర్ గౌడ్, సాగర్, మహేశ్, ప్రకాశ్ నాయక్, సరితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత శ్రీనివాస రామానుజన్



ఎంజీఐటీలో రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



శివరాంపల్లి పాఠశాలలో గణిత నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మణికొండ: ప్రపంచం గర్వించదగ్గ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ యువతకు స్ఫూర్తిదాయకమని బీహెచ్‌ఈఎల్ మాజీ జనరల్ మేనేజర్ వి.కృష్ణదత్ పేర్కొన్నారు. రామానుజన్ జయంతిని శనివారం గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ క్రమంలో మ్యాథమేటిక్స్, హ్యూమానిటీస్ విభాగాల ఆధ్వర్యంలో ఒక రోజు గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీహెచ్‌ఈఎల్ మాజీ జనరల్ మేనేజర్ వి.కృష్ణదత్ మాట్లాడుతూ... మ్యాథ్స్ అభివృద్ధికి శ్రీనివాస రామానుజన్ ఎనలేని కృషి చేసి మన దేశానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చారన్నారు. ఆయన సేవలను కొనియాడటంతో పాటు క్వాంటమ్ కంప్యూటింగ్‌ల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి, హెచ్‌ఓడీ డాక్టర్ వి.హరిలీల, గణిత అధ్యాపకుడు డాక్టర్ కె.శ్రీహరిలు శ్రీనివాస రామానుజన్ సేవలను వివరించారు. కార్యక్రమంలో గణిత అధ్యాపకులు డాక్టర్ జి.బాల్‌రెడ్డి, డాక్టర్ జి.సుధ, డాక్టర్ జి. శాంత, డాక్టర్ ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

శివరాంపల్లిలో...

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిషన్ మాట్లాడుతూ... గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ గొప్ప మేధావి అని కొనియాడారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల గణిత నమూనాలను పరిశీలించి ఉత్తమ నమూనాకు బహుమతి ప్రదానం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. గణిత దినోత్సవ సందర్భంగా పాఠశాలలో వివిధ పోటీలు, క్విజ్, ఉపన్యాసం, ముగ్గుల పోటీలు నిర్వమించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు వెంకటయ్య, ఉదయ లక్ష్మీ, కవిత, ఉదయశ్రీ, సంధ్య, రిజ్వానా, ఉపాధ్యాయులు సుదర్శన్, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న క్రేన్

యువతికి తీవ్ర గాయాలు

రాజేంద్రనగర్: క్రేన్ వాహనం వెనుక నుంచి స్కూటీని ఢీకొట్టడంతో స్కూటీ నడుపుతున్న ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికుల సమాచారం మేరకు... రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన దుర్గాదేవి(26) బ్యూటీషియన్ పని నిమిత్తం తన ద్విచక్ర వాహనం స్కూటీపై బుద్వేల్‌కు వెళ్లి సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణమైంది. రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద యూ టర్న్ తీసుకొని ముందుకు వెళ్తుండగా పీడీపీ చౌరస్తా నుంచి వస్తున్న క్రేన్ వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎగిరి కిందపడిన దుర్గాదేవికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదిలా ఉండగా... ప్రమాదం జరిగిన సమయంలో క్రేన్ డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వేగంగా దూసుకొచ్చాడని స్థానికులు తెలిపారు. గాయపడిన దుర్గాదేవిని స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్రేన్ డ్రైవర్ తన వాహనంతో పారిపోయినట్లు సమాచారం. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ పోలీసులు పేర్కొనడం గమనార్హం.